# సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 20 । మార్చి । 2024




**పిచ్చుకల కిలకిలలు ఏవీ?!**

ఒకప్పుడు విరివిగా కనిపించే ఊర పిచ్చుకలు నేడు కనుమరుగవుతున్నాయని పక్షి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 8లో



**నర్సరీల్లో కూలీల వేతన గోస**

అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే నర్సరీల్లో పని చేస్తున్న కూలీలకు సకాలంలో వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారు. 8లో

**వాతావరణం**

గరిష్టం / కనిష్టం 30° / 19°

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరు జల్లులు పడొచ్చు. రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.




## న్యూస్‌రీల్

### నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



సార్వభౌమ వాహనంలో స్వామివారి తిరువీధి సేవ..

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భ గుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళ వారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

**వైభవంగా సార్వభౌమ సేవ..**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో మంగళవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని సార్వభౌమ వాహనంలో వేంచేపు చేసి అత్యంత వైభవోపేతంగా తిరువీధి సేవ నిర్వహించారు.

### రెండో రోజు పరీక్షకు 56 మంది గైర్హాజరు

కొత్తగూడెంఅర్బన్ : పదో తరగతి పరీక్షల రెండోరోజైన మంగళవారం జిల్లాలో 56 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 12,331 మందికి గాను 12,275 మంది విద్యార్థులు పరీక్ష రాశారని డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు. జిల్లా పరిశీలకులు పి.మదన్‌మోహన్ ఐదు సెంటర్లు, డీఈఓ ఆరు సెంటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు 30 కేంద్రాలను తనిఖీ చేశారు. కాగా, జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ వివరించారు.

### ఏప్రిల్ 25 నుంచి 'ఓపెన్' పరీక్షలు

కొత్తగూడెం అర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు వచ్చే నెల 25 నుంచి జరగనున్నాయని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. ఏప్రిల్ 25 నుంచి మే 2వ తేదీ వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 9నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30నుంచి 5.30గంటల వరకు పరీక్షలు జరగనుండగా, ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు మే 3నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయని వెల్లడించారు.

### నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

చుంచుపల్లి: జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాల సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు జెడ్పీ హాల్‌లో ప్రారంభం అవుతుందని సీఈఓ ఎస్.ప్రసూనారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

### కొత్తగా రాజధాని బస్సులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం డిపోకు తాజాగా ఎనిమిది రాజధాని బస్సులను కేటాయించారు. ప్రస్తుతం ఉన్న బస్సులు పరిమితి మించి కిలోమీటర్లు తిరగడమే కాక సీట్లు, ఏసీల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఆర్టీసీ ఉన్నతాధికారులు ఖమ్మం కొత్తగా ఎనిమిది బస్సులను కేటాయించగా హైదరాబాద్‌కు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఖమ్మం కొత్త బస్టాండ్ నుంచి ప్రతీ గంటకు బస్సు మొదలవుతుందని, కొత్త, పాత బస్టాండ్లలో రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు.

# వరద కష్టాలకు చెక్..



కరకట్ట నిర్మాణానికి తవ్వుతున్న కాలువ

**అన్నీ సజావుగా సాగితే రెండు నెలల్లో గోదావరి కరకట్ట నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. పాతికేళ్ల తర్వాత భద్రాచలం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలకు గోదావరి వరదల నుంచి రక్షణ లభించనుంది. ఈ మేరకు నదీ తీరం వెంట పనులు ప్రారంభమయ్యాయి.**

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

**ప్రారంభమైన కరకట్ట పనులు**

- రంగంలోకి దిగిన భారీ యంత్రాలు
- జోరుగా సాగుతున్న భూ సామర్థ్య పరీక్షలు
- 700 మీటర్ల పొడవుతో కరకట్ట నిర్మాణం
- కూనవరం – భద్రాచలం రోడ్డులో మరో వంతెన

**మొదట 7.5 కిలోమీటర్లు..**

గోదావరి నదికి 1986లో రికార్డు స్థాయిలో 76 అడుగుల ఎత్తులో వరద వచ్చింది. పట్టణం సగం వరదలో మునిగిపోయింది. శ్రీరాముడు కొలువుదీరిన భద్రగిరి చుట్టూ నీరు చేరుకుంది. అప్పటి నుంచి గోదావరి వరద నుంచి రక్షణ కల్పించాలని ఇటు రామయ్య భక్తులు, అటు భద్రాచలం పట్టణ వాసులు ప్రభుత్వాలను వేడుకున్నారు. ఎట్టకేలకు 2000 సంవత్సరంలో భద్రాచలానికి రక్షణగా సుమారు 7.5 కిలోమీటర్ల పొడవుతో కరకట్ట నిర్మించారు. 1986లో వచ్చిన గరిష్ఠ వరదను దృష్టిలో ఉంచుకుని కనిష్ఠంగా పది మీటర్లు, గరిష్ఠంగా 15 మీటర్ల (సగటున 80 అడుగులు) ఎత్తుతో కరకట్ట ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి గోదావరి వరదల నుంచి భద్రాచలం పట్టణానికి వరద నుంచి ఉపశమనం లభించినా.. పూర్తిస్థాయిలో ముప్పు తొలగిపోలేదు.

**రోడ్డు కారణంగా కొంతమేర రద్దు..**

వరద కాంటూరు లెవల్స్ ఆధారంగా ముందుగా నిర్దేశించిన ప్లాన్ ప్రకారం కరకట్ట చర్ల రోడ్డులో ఏపీలోని యటపాక వద్ద మొదలై కూనవరం రోడ్డులోని సరస్వతి శిశుమందిర్ దాటిన తర్వాత ముగియాలి. యటపాక నుంచి కూనవరం రోడ్డు వచ్చే వరకు కరకట్ట అంతా గోదావరి తీరం వెంబడే ఉంటుంది. కానీ సరస్వతీ శిశుమందిర్ దాటిన తర్వాత గోదావరి తీరం నుంచి కాస్త దూరంగా జరుగుతూ వచ్చి భద్రాచలం – కూనవరం రోడ్డు మీదుగా వెళ్తుంది. దీంతో ఇక్కడ కొత్త వంతెన నిర్మాణం అవసరం కావడంతో రోడ్డు దగ్గర ఇరువైపులా కరకట్ట నిర్మాణ పనులు రద్దు చేశారు. రోడ్డు నుంచి గోదావరి ప్రవహించే వైపు 600 మీటర్లు, మరో వైపు 100 మీటర్లు వదిలేసి నాడు కరకట్ట నిర్మించారు.

**రూ. 38 కోట్లతో పనులు..**

గోదావరి వరదలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వ హయాంలో మిగిలిన కరకట్ట నిర్మాణం చేపట్టేందుకు రూ. 38 కోట్లు మంజూరయ్యాయి. అయితే పనులు ప్రారంభించకముందే ప్రభుత్వం మారిపోయింది. దీంతో కరకట్ట నిర్మాణం డోలాయమానంలో పడింది. కాగా, కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం కరకట్ట నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో కూనవరం రోడ్డులో కరకట్ట నిర్మాణ పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం భూ సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనంతరం 700 మీటర్ల పొడవు, 12 మీటర్ల ఎత్తుతో కరకట్ట నిర్మించనున్నారు. జూన్ చివరి నాటికి కరకట్ట పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్ వెల్లడించారు.

**వంతెనకు అనుమతి వచ్చేనా..?**

గతంలో కరకట్ట నిర్మాణానికి కూనవరం – భద్రాచలం రోడ్డు ప్రధాన అడ్డంకిగా మారింది. ప్రస్తుతం కరకట్ట నిర్మించి వరద నుంచి రక్షణ రావాలంటే ఈ రోడ్డు మీదుగా కరకట్ట నిర్మించాలి. ఆ తర్వాత వాహనాల రాకపోకలకు అనుగుణంగా కరకట్ట మీదుగా వంతెన నిర్మించాలి. ఈ మేరకు జాతీయ రహదారుల సంస్థ నుంచి అనుమతి రావాలి. గోదావరిపై రెండో వంతెన నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పేలా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కరకట్ట మీదుగా నిర్మించే వంతెన విషయంలో అనుమతులు, టెండర్లు తదితర ప్రక్రియలను త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

**65 అడుగులు దాటితే..**

భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక అయిన 53 అడుగులు స్థాయి వరకు వరద వస్తే కూనవరం రోడ్డులో ఉన్న లోతట్టు ప్రాంతాలకు పెద్దగా ప్రమాదం ఉండదు. కానీ 65 అడుగులకు మించి వరద వస్తే.. కరకట్ట నిర్మించని భద్రాచలం – కూనవరం రోడ్డు మీదుగా పట్టణంలోకి వరద వస్తోంది. సరస్వతీ శిశుమందిర్, ఆర్టీఓ కార్యాలయం, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్, సుభాష్‌నగర్ తదితర కాలనీలు వరద నీటిలో మునిగిపోతున్నాయి. ముఖ్యంగా 2022 జూలైలో వచ్చిన వరదలతో ఎన్నడూ లేని విధంగా డిగ్రీ కాలేజీ వెనుక ఉన్న కాలనీలోని ఇళ్లు పూర్తిగా మునిగిపోయాయి. దీంతో గతంలో అర్ధంతరంగా ఆగిపోయిన కరకట్ట నిర్మాణం చేపట్టాలనే డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చింది.

# రెండోరోజూ మెడికోల ఆందోళన





కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్) వైద్య కళాశాలలో విచారణకు వెళ్తున్న అధికారులు

- వైద్య కళాశాల ఎదుట ధర్నా
- ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల విద్యార్థులు రెండో రోజు కూడా కళాశాల ఎదుట ధర్నా చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని, ప్రిన్సిపాల్ వేధింపులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ చర్యలను నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట 300 మంది వైద్య విద్యార్థులు సోమవారం ఆందోళన చేసిన విషయం తెలిసిందే. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినా స్పందన లేదంటూ తిరిగి మంగళవారం కూడా ఆందోళనకు దిగారు. దీంతో పాల్వంచ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రాము అక్కడికి చేరుకుని వైద్య విద్యార్థులతో మాట్లాడారు. ఎవరితో సమాధానం చెప్పించాలని అడగగా వారు డీఎంఈ(డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. అయితే అది ఇప్పుడు సాధ్యం కాదని, ఎన్నికల కోడ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ధర్నా చేయొద్దని సూచించడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

**వైద్య కళాశాలలో విచారణ**

రెండు రోజులుగా వైద్య విద్యార్థులు ఆందోళన చేస్తుండడంతో స్పందించిన డీఎంఈ వాణి విచారణకు ఆదేశించారు. దీంతో ఖమ్మం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సుంకరి రాజేశ్వరరావు, మాజీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌తో పాటు మరో ఇద్దరు అధికారులు మంగళవారం కొత్తగూడెం మెడికల్ కాలేజీలో విచారణ చేపట్టారు. విద్యార్థులతో మాట్లాడగా.. ప్రిన్సిపాల్ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం లేదని, ల్యాబ్‌ల్లో సౌకర్యాలు లేవని తెలిపారు. రాత్రి వేళ హాస్టల్‌కు వార్డెన్లను పంపిస్తూ వీడియోలు తీయిస్తున్నారని వైద్య విద్యార్థినులు విచారణ బృందం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం బృందం సభ్యులు బాలుర హాస్టల్‌లో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తాగునీరు, ల్యాబ్ సక్రమంగా లేవని, ఇరుకు గదుల్లో ఉంటున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్‌ను ఏమైనా అడిగితే డీబార్ చేస్తామని, ప్రాక్టికల్ మార్కులు, హాజరు మార్కులు తక్కువ వేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సర కాలంగా ఇదే పరిస్థితి ఉందని, అందుకే తాము ఆందోళన చేయాల్సి వచ్చిందని వివరించారు. తమ సమస్యను కలెక్టర్‌కు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులకు పాల్పడుతున్న ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలని కోరారు. కాగా, ఈ ఘటనపై విచారణకు కలెక్టర్ ప్రియాంక ఆల కమిటీని ఏర్పాటుచేశారు.

# ఉద్యోగుల హక్కులను పరిరక్షిస్తాం

**టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు**



మహిళా అధికారిని సన్మానిస్తున్న ఏలూరి తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, ఇతర హక్కుల సాధనకు తమ సంఘం కట్టుబడి ఉందని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైతే అన్ని సంఘాలను కలుపుకుని ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల పరిస్థితి దారుణంగా ఉండేదని, వేతనాల కోసం 15వ తేదీ దాటినా ఎదురుచూడాల్సి వచ్చేదని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ హయాంలో పరిస్థితి కొంత మెరుగ్గానే ఉన్నా.. సమస్యల పరిష్కారం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

**ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు..**

టీజీవోస్ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తున్నారని అన్నారు. కుటుంబ, ఉద్యోగ భాధ్యతలను మోస్తున్న మహిళలకు చేతులెత్తి మొక్కాలని వ్యాఖ్యానించారు. అనంతరం పలువురు మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆయా కార్యక్రమాల్లో గెజిటడ్ అధికారుల సంఘం నాయకులు పి.విజయ్‌కుమార్, కె.వెంకటేశ్వర్లు, బి.దస్రు, అబ్రహం, జె.తిరుపతి, ఎస్.కనకదుర్గ, దుర్గమ్మ, రుక్మిణీదేవి, విజేత, ఎ.రామారావు, చైతన్య భార్గవ్ తదితరులు పాల్గొనగా సంగం వెంకటపుల్లయ్య అధ్యక్షత వహించారు.

# దివ్యాంగులకు చేయూత అందించాలి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్ : దివ్యాంగులకు చేయూత అందించాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి అన్నారు. కేంద్ర ప్రభుత్వం, దివ్యాంగుల సాధికారిత సంస్థ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఆవాస ప్రాంతంలో ఉన్న దివ్యాంగ పిల్లలను గుర్తించి, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. సమ్మిళిత విద్య కో–ఆర్డినేటర్ ఎస్‌కే సైదులు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సాధారణ ప్రజలను సైతం చైతన్య పరచి, దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం ద్వారా వచ్చే ఉపకార వేతనాలు, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్సులు, దివ్యాంగ పరికరాలు, ఫిజియోథెరపీ వంటి సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. జాతీయ మేథో వైకల్య సాధికారత సంస్థ రిసోర్స్‌పర్సన్ లఖన్ బాబు మాట్లాడుతూ ఆరేళ్ల లోపు దివ్యాంగులు త్వరగా కోలుకునే అవకాశం ఉందని, అలాంటి వారిని గుర్తించాలని అన్నారు. గర్భస్థ దశలో తల్లి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేయాలని సూచించారు. దివ్యాంగుల చట్టాలు, వారికి అందించే పథకాల గురించి అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ, ఆశ వర్కర్లను కోరారు. కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ విభాగం ప్రోగ్రాం అధికారి సుకృత, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు ఎ.నాగరాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# చేయి.. అందుకుంటాం!



- కాంగ్రెస్‌లో చేరికకు నేతల సన్నద్ధం
- మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే ప్రయత్నాలు
- అదే బాటలో బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు కొందరు..
- ఇప్పటికే సీఎం సభకు హాజరైన భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు
- స్థానిక మంత్రులు, నేతల ఆశీస్సులు ఉంటేనే లైన్ క్లియర్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఉమ్మడి జిల్లాలోని పలు పార్టీల నేతలు హస్తం గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నేతలు.. బీఆర్‌ఎస్ తదితర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా హస్తం నాయకులు పావులు కదుపుతున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న కొందరు బీఆర్‌ఎస్ నేతలు 'చేయి' అందుకోవడంపై దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రితో పాటు ఓ మాజీ ఎమ్మెల్యే, మరో ఇద్దరు ముఖ్య నేతలు బీఆర్‌ఎస్‌ను వీడి త్వరలో కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

**మాజీ మంత్రి.. మళ్లీ**

అసెంబ్లీ ఎన్నికలకు ముందే బీఆర్‌ఎస్‌లో చేరిన ఓ మాజీ మంత్రి మళ్లీ కాంగ్రెస్ బాట పట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. గతంలో ఆయనకు ఉన్న పరిచయాలతో ఇప్పటికే పార్టీ పెద్దలతో చర్చించినట్లు సమాచారం. అలాగే ఓ మాజీ ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు. ఇటీవల ఆయన బీఆర్‌ఎస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో కాంగ్రెస్‌లో చేరడం లాంఛనమేననే ప్రచారం జరుగుతోంది. కొత్తగూడేనికి చెందిన ఓ ముఖ్య నేత సైతం కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, ఇప్పటికే పార్టీ నేతలతో భేటీ అయ్యారని సమాచారం. ఇక గతంలో టీపీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్న మానవతారాయ్ సత్తుపల్లి టికెట్ ఆశించినా ఫలితం లేకపోవడంతో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన కూడా కాంగ్రెస్ పార్టీ నేతలతో ఉన్న పరిచయాలతో రెండు, మూడు రోజుల్లోనే మూడు రంగుల కండువా కప్పుకోనున్నట్లు అనుచరులకు సమాచారం ఇచ్చారు.

**తేట'తెల్లం'..**

ఈనెల 11న భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యేగా డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ఇంతవరకూ బాగానే ఉన్నా అదే రోజు మణుగూరులో కాంగ్రెస్ ఆధ్వర్యాన నిర్వహించిన ప్రజాదీవెన సభకు సైతం తెల్లం హాజరై వేదికపై కూర్చోవడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సంకేతాలు ఇచ్చినట్లయింది. ఇటీవల తన కుటుంబ సభ్యులతో కలిసి సీఎంను ఆయన కలిశారు. అప్పటి నుంచి బీఆర్‌ఎస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటుండగా, ఆ పార్టీ నేతలు సైతం ఆయనపై ఆశలు వదులుకున్నారు. లోక్‌సభ పోలింగ్ సమీపించే కొద్దీ పార్టీలో చేరికలు పెరుగుతాయని కాంగ్రెస్‌లో చర్చ జరుగుతోంది.

**బీఆర్‌ఎస్ డీలా పడడంతో..**

అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ డీలా పడడం, రాష్ట్రంలోనూ అధికారంలోకి రాకపోవడంతో ఆ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ బాట పట్టారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల ముందు, తర్వాత కొందరు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి వెళ్లారు. తాజాగా 45వ డివిజన్ బీఆర్‌ఎస్ కార్పొరేటర్ బుడిగం శ్రీనివాస్ సైతం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసినా ఏ పార్టీలో చేరేది ప్రకటించలేదు. వైరా, సత్తుపల్లి, మధిర, ఇల్లెందు, కొత్తగూడెం, అశ్వారావుపేట, పినపాక నియోజకవర్గాల్లోనూ పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు 'చేయి' అందుకున్నారు. అధికారంలో ఉన్న పార్టీలో చేరితే రాజకీయంగా ఇబ్బందులు ఉండవనే ఉద్దేశంతో పార్టీ మార్పునకు సిద్ధమవుతుండగా, వారిని బుజ్జగించేందుకు బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.

**మంత్రుల ఆశీస్సులు తప్పనిసరి**

కాంగ్రెస్‌లో చేరాలనుకునే బీఆర్‌ఎస్, ఇతర పార్టీల ముఖ్యులకు స్థానిక మంత్రుల ఆశీస్సులు ఉండాలని ఆ పార్టీ అధిష్టానం మెలిక పెట్టినట్లు తెలిసింది. దీంతో ఇప్పటికే ఢిల్లీ, రాష్ట్ర స్థాయి పెద్దలతో చర్చించిన నేతలు ఇప్పుడు స్థానిక మంత్రుల ఆశీస్సులు దక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో గెలవడమే కాక భారీ మెజార్టీ సాధించాలన్న లక్ష్యం చేరికలతో నెరవేరాలని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే కొందరు బీఆర్‌ఎస్ నేతల చేరికలను కాంగ్రెస్ స్థానిక నేతలు వ్యతిరేకిస్తుండడంతో అధిష్టానం ఎలా ముందుకు వెళ్తుందో వేచిచూడాల్సిందే.

## కంటైనర్ ఏర్పాటుకు రూ.5లక్షల విరాళం



ఈఓ రమాదేవితో దాత కుటుంబసభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం గోశాల వద్ద దాణా నిల్వ చేసే కంటైనర్ ఏర్పాటుకు భక్తులు రూ.5లక్షల విరాళం అందజేశారు. పట్టణంలోని రెవెన్యూ కాలనీకి చెందిన పసుమర్తి రామారావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి లక్ష్మీకుమారి, కుమారులు దిలీప్–శ్రీలక్ష్మి, బాలాజీ–శరణ్య, కుటుంబసభ్యులు ఈ విరాళాన్ని ఆలయ ఈఓ రమాదేవికి అందజేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకోగా, ఆలయ అధికారులు స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం అందించారు.

## క్లుప్తంగా

### సీఆర్‌పీఎఫ్ రైజింగ్ డే సందర్భంగా రక్తదానం



రక్తదానం చేస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు, జవాన్లు

**భద్రాచలంఅర్బన్:** సీఆర్‌పీఎఫ్ రైజింగ్‌డే సందర్భంగా ఎటపాకలోని సీఆర్‌పీఎఫ్ 212 బెటాలియన్ క్యాంపులో మంగళవారం రక్తదానం చేశారు. భద్రాచలం ఏరియా వైద్యశాల ఆధ్వర్యంలో క్యాంపులో ఏర్పాటు చేసిన శిబిరంలో కమాండెంట్ శ్రీవాత్సవ్, సెకండ్ ఇన్ కమాండెంట్ దినేశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ మహీర్‌తో పాటు 30 మంది జవాన్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల వైద్యులు మల్లీశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్లు చందు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### నర్సరీల తనిఖీ



నర్సరీలను తనిఖీ చేస్తున్న విద్యాచందన

**పాల్వంచ :** మండలంలోని లక్ష్మీదేవిపల్లి, బసవతారక కాలనీ, జగన్నాథపురం, కేశవాపురం గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ విద్యాచందన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ నర్సరీలో 100 శాతం మొక్కలు బతికేలా చూడాలని, గ్రామ పంచాయతీ అవసరాలకు అనుగుణంగా మొక్కలు పెంచాలని సూచించారు. మొక్కల రకం తెలిసేలా ప్రతి బెడ్ ముందు బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్ రెడ్డి, ఏపీఓ పోరండ్ల రంగా, గ్రామ పంచాయతీ కార్యదర్శులు కృష్ణవేణి, రాంబాబు, సాయిరాం, ఫీల్డ్ అసిస్టెంట్లు నాగేశ్వరరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### సింగరేణిలో పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించాలి



అధికారులతో సమీక్షిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణిలోని వివిధ విభాగాల్లో పెండింగ్ ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని డైరెక్టర్ (పా) ఎన్వీకే శ్రీనివాస్ సూచించారు. కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయం నుంచి మంగళవారం ఆయన పర్సనల్, ఐటీ, లా విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్షించారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, ఏరియాల వారీగా కోర్టు కేసుల వివరాలను ప్రత్యేక వెబ్ పోర్టల్‌లో పొందుపర్చాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు కట్టా బసవయ్య, బి.హన్మంతరావు, జీఎం కవితానాయుడు, కోడూరి శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, కె.నారాయణరావు, వైఈఎల్ ప్రసాద్‌రావు, హరిశంకర్, ప్రదీప్, సీవీఎస్ మూర్తి, రాజ్‌గోపాల్, ఎల్.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం



జరిమానా పత్రాలతో రవాణాదారులు

**మణుగూరురూరల్:** మండలంలోని ఇసుక ర్యాంపుల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న తొమ్మిది ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నామని మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి మంగళవారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేయడం నేరమన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనదారులకు ఒక్కొక్కరికీ రూ.5వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

### తమ్మిలేరువాగులో పడిన డీసీఎం

**సురక్షితంగా బయటపడిన డ్రైవర్**

**సత్తుపల్లిటౌన్:** డీసీఎం వ్యాన్ అదుపుతప్పి వాగులో పడిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి విశాఖపట్నంకు కెమికల్ లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ సత్తుపల్లి శివారులోని తమ్మిలేరు వంతెనపై రెయిలింగ్‌ను ఢీకొని వాగులో పడిపోయింది. దీంతో ప్రమాదాన్ని గుర్తించిన వ్యాన్ డ్రైవర్, వరంగల్ జిల్లాకు చెందిన దేవరాజు సందీప్ చాకచక్యంగా డోర్ తీసుకుని ఈదుతూ ఒడ్డుకు వచ్చాడు. స్వల్పగాయాలైన ఆయన ఆస్పత్రికి వెళ్లగా, డీసీఎంను క్రేన్ సాయంతో బయటకు తీసేందుకు చేసిన ప్రయత్నాలు మంగళవారం రాత్రి వరకు ఫలించలేదు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.13,045 |

# పిచ్చుకల కిలకిలలు ఏవీ?!

- గ్రామీణ ప్రాంతాల్లో కానరాని పిట్టలు
- రేడియేషన్ పెరుగుతుండడంతో ప్రశ్నార్థకంగా మనుగడ
- ఇకనైనా కాపాడుకుంటేనే జీవవైవిధ్యం

**నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం**



**పాల్వంచరూరల్:** పల్లె, పట్టణం తేడా లేకుండా సహజ సిద్ధంగా చలాకీగా కనిపించే ఊర పిచ్చుకలు ఆధునిక వ్యవస్థలో కనుమరుగవుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతుండటం వీటి మనుగడకు శాపంగా మారుతోందని పక్షి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మారుతున్న కాలంతోపాటు ప్రకృతిలో స్వేచ్ఛగా విహరించే అరుదైన పిచ్చుకల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. దినదినాభివృద్ధి చెందుతున్న డిజిటల్ వ్యవస్థ, సాంకేతిక పరిజ్ఞానం ఊరపిచ్చుకల సంతతి కనుమరుగు కావడానికి కారణమవుతోందని చెబుతున్నారు. నేడు (బుధవారం) ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా.. అవి అంతరించి పోవడానికి కారణాలు, తదితర అంశాలపై కథనం..

**జీవవైవిధ్యం.. మన సొంతం**

ప్రపంచంలో అత్యంత జీవ వైవిధ్యం కలిగిన దేశాల్లో భారతదేశం ఒక్కటి. ఇక ఉమ్మడి ఖమ్మం జిల్లా విషయానికొస్తే కిన్నెరసాని అభయారణ్యం, రిజర్వాయర్ ఇదే కోవలోకి వస్తాయి. దట్టమైన అరణ్యం, విస్తారమైన పచ్చిక బయళ్లు, ఏడాది పొడవునా నీరు ఉండే రిజర్వాయర్, వేల రకాల అరుదైన పక్షిజాతులతో ఈ ప్రాంతం పరిఢవిల్లుతోంది. ఈ ప్రాంతంలో లక్షలాది సంఖ్యలో పిచ్చుకలు సంచరిస్తుంటాయి. అయితే, సెల్‌ఫోన్ల పుణ్యామా అని అటవీ ప్రాంతాల్లో కూడా సెల్ టవర్లు నిర్మాణం చేయడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

**ఇలా చేస్తే మనుగడ**

పిచ్చుకల సంతతిని కాపాడడాన్ని అందరూ బాధ్యతగా భావిస్తేనే ఫలితం ఉంటుంది. కుటుంబ సభ్యుల మాదిరి ఆహ్వానించేలా ఇళ్ల వసారాల్లో గూడు, తాగునీటి వసతి, ధాన్యం అందుబాటులో ఉంచాలి. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో మట్టి పాత్రల్లో నీరు నింపితే పక్షుల దాహార్తి తీర్చినట్లవుతుంది. అలాగే, గ్రామీణ ప్రాంతాల్లో వరి పొలాలను యంత్రాలతో కోయిస్తుండటంతో ధాన్యం దొరకని పరిస్థితి తలెత్తుతోంది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని సామర్థ్యం మేరకు వరి కంకులను వీలైన చోట్ల వేలాడదీస్తే ఫలితం ఉంటుందని పక్షి ప్రేమికులు చెబుతున్నారు.



**చూడముచ్చటగా..**

పిచ్చుకలు పల్లెల్లో కిలకిల శబ్దాలతో సందడి చేసేవి. దిగుడుబావుల్లోకి వేలాడుతున్న చెట్లపై కట్టుకున్న గూళ్లు చూడముచ్చటగా ఉండేవి. అయితే, సెల్ టవర్ల నిర్మాణం వలన రేడియేషన్, కాలుష్యం కారణంగా ఇవి ప్రకృతి నుంచి కనుమరుగవుతున్నాయి. జనావాసాలతో మమేకమై జీవిస్తున్న వీటి జీవన విధానం, సంతతి అభివృద్ధి తదితర అంశాలను బేరీజు వేసుకుని వీటి రక్షణలో అందరూ పాలుపంచుకునేలా ఏటా మార్చి 20న పిచ్చుకల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. జనావాసాల మధ్య నివసిస్తున్న పిచ్చుకల మనుగడకు ప్రమాదం ఏర్పడితే జీవవైవిధ్యం దెబ్బతింటుందని.. తద్వారా అది మానవ మనుగడకు సైతం ప్రమాదమేనని గుర్తించిన ప్రపంచ దేశాలు ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. అంతేకాక భారత ప్రభుత్వం తపాలా బిళ్లను సైతం విడుదల చేసింది.

**అవగాహన కల్పిస్తున్నాం..**



పిచ్చుకల సంతతి పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఈ విషయంలో అందరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలి. కిన్నెరసాని వద్ద స్టాండ్లు ఏర్పాటుచేశాం. సెల్‌టవర్ల కారణంగా రేడియేషన్, కాలుష్యంతో పిచ్చుకలు స్వేచ్ఛగా విహరించడం లేదు.

–కృష్ణగౌడ్, భద్రాద్రి జిల్లా అటవీశాఖాధికారి

**పిచ్చుకలను సంరక్షించాలి..**



పిచ్చుకల సంతతి రోజురోజుకూ కనుమరుగువుతోంది. మానవ అభివృద్ధి పేరిట చేపడుతున్న చర్యలు ఈ పరిస్థితికి కారణమవుతున్నాయి. పిచ్చుకలకు పూర్వవైభవం రాకపోతే పర్యావరణానికే కాక మానవాళికీ ఇబ్బందులు ఎదురవుతాయి.

–రమేశ్‌రాథోడ్, గ్రీన్ ఎర్త్ సొసైటీ అధ్యక్షుడు

**సెల్ టవర్లతో ముప్పు..**



సాంకేతిక పరిజ్ఞానం పిచ్చుకల మనుగడకు శాపంగా మారింది. పట్టణీకరణ, అంతరించి పోతున్న అడవులు, విచ్చలవిడిగా సెల్‌టవర్ల ఏర్పాటు ఇందుకు కారణమవుతున్నాయి. అంతేకాకుండా పండ్లు, ఆహార ధాన్యాల ఉత్పత్తుల్లో రసాయనాల వాడకం పెరగడం కూడా ప్రభావం చూపుతోంది.

–జీవీ చంద్రశేఖర్, జంతు ప్రేమికుడు

## అన్ని పార్టీల్లో ఆదివాసీలకు అన్యాయమే..

**తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్**



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్, పక్కన నాయకులు

**ఇల్లెందురూరల్:** విద్య, ఉపాధి రంగాలతోపాటు రాజకీయంగా కూడా ఆదివాసీలకు అన్ని పార్టీలు అన్యాయం చేస్తున్నాయని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇల్లెందు మండలం సుభాష్‌నగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలోని వనరులపై హక్కు కలిగి ఉన్న ఆదివాసీలకు ఆ ఫలాలు అందకుండా పాలకులే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఏజెన్సీలో అత్యధిక జనాభా కలిగిన ఉన్నా మహబూబాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఆదివాసీలకు కాకుండా అన్ని పార్టీలు లంబాడీలకే అవకాశం ఇవ్వడం సరికాదన్నారు. ఈ మేరకు ఏజెన్సీల ఆదివాసీల ఉనికి ప్రశ్నార్థకం కాకుండా మహబూబాబాద్ లోక్‌సభ స్థానం నుంచి తుడుందెబ్బ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నట్లు అరుణ్‌కుమార్ ప్రకటించారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలన్న ప్రధాన డిమాండ్‌తో ప్రచారం చేస్తామని, తనను గెలిపిస్తే డీలిమిటేషన్‌లో భద్రాచలం పేరుతో పార్లమెంట్ స్థానాన్ని సాధిస్తానని తెలిపారు. నాయకులు సనప కోటేశ్వరరావు, ఎట్టి శ్రీనివాసరావు, పొదెం రామ్మూర్తి, మోకాళ్ల సతీశ్, కల్తీ రాంప్రసాద్, రాంబాబు, తాటి మల్లయ్య, ప్రభాకర్, నరేందర్, సందీప్, శ్రీకాంత్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ క్రీడాపోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సీఈలు

**పాల్వంచ:** జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ వాలీబాల్, లాన్ టెన్నిస్ పోటీలు పాల్వంచలోని విద్యుత్ కళాభారతి క్రీడామైదానంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలతోపాటు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన లాన్ టెన్నిస్ సింథటిక్ కోర్టును కేటీపీఎస్ 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావు, 5, 6వ దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు, ట్రైనింగ్ సెంటర్ సీఈ కె.శ్రీనివాసబాబు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో ఉద్యోగులు, కార్మికుల్లో ఉత్సాహం పెరుగుతుందని తెలిపారు. కాగా, కేటీపీపీ భూపాలపల్లి, పోచంపాడు, రామగుండం, విద్యుత్ సౌధ, జూరాల, పులిచింతల, బీటీపీఎస్, శ్రీశైలం, నాగర్జునసాగర్, కేటీపీఎస్ 5, 6వ దశలతో పాటు 7వ దశ జట్లు పాల్గొంటున్నాయి. జెన్‌కో స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్.లోహిత్ ఆనంద్, ఎస్ఈ యుగపతి, డీఈ ఎస్ఎన్ఎస్ శేఖర్, గేమ్స్ సెక్రటరీలు వై.వెంకటేశ్వర్లు, టి.వీరస్వామి, రిఫరీలు ఎం.వీరునాయక్, జి.వెంకటేశ్వర్లు, కె.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# శవ పంచనామాకు లంచం?

- ఏసీబీకి ఫిర్యాదు చేసిన స్థానికులు
- తనిఖీల సమాచారంతో బయటపడిన వైద్యుడు

**అశ్వారావుపేట:** జ్వరం బారిన పడిన ఓ గిరిజనుడు చనిపోగా.. పోస్టుమార్టం చేసేందుకు గాను ఆస్పత్రి అభివృద్ధి పేరిట వైద్యాధికారి రూ.40వేలు డిమాండ్ చేశాడు. బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు.. అశ్వారావుపేట మండలం రామన్నగూడేనికి చెందిన నారం రామారావు(37) తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా సోమవారం అశ్వారావుపేట ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు కొత్తగూడెం తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. దీంతో 108 సిబ్బంది మృతదేహాన్ని అశ్వారావుపేట ఆస్పత్రి మార్చురీకి తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం మృతుడి బంధువులు జ్వరంతోనే చనిపోయినందున మృతదేహాన్ని తీసుకెళ్తామని చెప్పగా వైద్యుడిని, పోలీసులను సంప్రదించాలని సిబ్బంది సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాక పోస్టుమార్టం చేయాలా, వద్దా తెల్పుకోవాలని చెప్పిన కానిస్టేబుల్ ఆ తర్వాత డాక్టర్‌ను సంప్రదించాలని చెప్పాడని సమాచారం. మళ్లీ ఆస్పత్రికి వెళ్లగా అనుమానం ఉన్నందున పోస్టుమార్టం చేయాలని, ఇందుకు ఆస్పత్రి అభివృద్ధి కోసం రూ.40 వేలు ఇవ్వాలని ఓ వైద్యుడు కోరినట్లు మృతుడి కుటుంబసభ్యులు ఆరోపించారు. అంత ఇచ్చుకోలేమని బతిమాలినా ససేమిరా అనడంతో ఓ వ్యక్తి ఏసీబీ అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బేరసారాలు సాగగా, కాంగ్రెస్ నాయకులతో చెప్పించినా వినలేదని సమాచారం. చివరకు ఏసీబీ అధికారులు వస్తున్నారనే సమాచారం బయటకు పొక్కడంతో పోస్టుమార్టం చేయకుండానే మృతదేహాన్ని తీసుకువెళ్లాలని వైద్యాధికారి చెప్పినట్లు తెలిసింది. కాగా, వైద్యుడితో ఫోన్‌లో మాట్లాడిన సమయాన డబ్బుల విషయం ప్రస్తావన రికార్డ్ కావడంతో దాని ఆధారంగా కేసు నమోదుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని వైద్యాధికారి రాజశేఖర్ దృష్టికి తీసుకువెళ్లగా పోస్టుమార్టం చేసేందుకు అవసరమయ్యే కట్టుగుడ్డలు, ఇతర ఖర్చుల కోసం సిబ్బందికి నగదు ఇవ్వమని చెప్పామే తప్ప లంచం అడగలేదని పేర్కొనడం గమనార్హం.

## అటవీ నర్సరీల్లో కూలీల వేతన గోస



అటవీ నర్సరీలో పనిచేస్తున్న కూలీలు

**చుంచుపల్లి:** అటవీశాఖ ఆధ్వర్యాన నిర్వహించే నర్సరీల్లో పనిచేస్తున్న కూలీలకు సకాలంలో వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారు. కూలీ కోసం పది నెలలుగా ఎదురుచూస్తున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కొత్తగూడెం అటవీ డివిజన్ పరిధిలోని అబ్బుగూడెం, జయశంకర్‌కాలనీ, లోతువాగు, వనవిహార్, జూలూరుపాడు ప్రాంతాల్లో మొక్కల పెంపకానికి నర్సరీలు నిర్వహిస్తున్నారు. వీటి పరిధిలో సుమారు 700 మంది కూలీలు నిత్యం పనులకు వస్తుండగా, నెలల తరబడి డబ్బులు అందడం లేదని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, రెండు రోజుల కిందట కొత్తగూడెం అటవీశాఖ డివిజన్ కార్యాలయం వద్ద ఆందోళన చేసేందుకు కొందరు కూలీలు రాగా అధికారులు సర్దిచెప్పి పంపారు. నర్సరీల్లో ఒక్కో కూలీకి రోజు రూ.350 చొప్పున చెల్లిస్తారు. కానీ, పది నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. అధికారులు మొన్నటి వరకు బడ్జెట్ రాలేదని చెప్పగా.. ఇప్పుడు బడ్జెట్ మంజూరైనా చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే, నర్సరీల్లో మట్టి పనులు చేసిన జేసీబీ, డోజర్ల యజమానులకు సైతం బకాయి ఉన్నట్లు సమాచారం.

## కోడి పందేల స్థావరంపై దాడి

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని పాపిడిగూడెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రెండు పందెం కోడి పుంజులు, ఒక ద్విచక్రవాహనం, రూ.1200తోపాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ శ్రీను తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి, ఘటనా స్థలం నుంచి పారిపోయిన వ్యక్తుల గురించి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

## క్షేత్ర సందర్శనలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు



నర్సరీలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు

**అశ్వారావుపేటరూరల్:** అశ్వారావుపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం క్షేత్ర సందర్శనకు వెళ్లారు. సత్తుపల్లి మండలం సత్యనారాయణపురం వెళ్లిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అక్కడి నుంచి నర్సరీలను సందర్శించి మొక్కల పెంపకంలో జాగ్రత్తలను తెలుసుకున్నారు. వక్క మొక్కలతోపాటు అరటి, జాజిపత్రి, కశ్మీర్ యాపిల్, యాలకులు ఇతర మొక్కలను పెంచి విక్రయిస్తున్నట్లు బాధ్యులు తెలిపారు. అనంతరం గంగారంలోని పీఏసీఎస్‌ను కూడా సందర్శించిన విద్యార్థులు సంఘం పనితీరు, రుణాల వడ్డీ రేట్లు తెలుసుకున్నారు. కళాశాల డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్, ప్రొఫెసర్లు డాక్టర్ కృష్ణతేజ, డాక్టర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టుమాస్టర్ చేతివాటం..

**విచారణ చేపట్టిన పోస్టల్ ఎస్పీ**



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోస్టల్ ఎస్పీ

**దుమ్ముగూడెం:** మండలంలోని లక్ష్మీనగరం పోస్టల్‌శాఖలో విధులు నిర్వర్తిస్తున్న బ్రాంచ్ పోస్టుమాస్టర్ చేతివాటం (దాదాపు రూ.50వేలు) ఎక్కువైంది. పలువురు ఖాతాదారుల ఖాతాల్లో నుంచి వారికి తెలియకుండా నగదు మాయం కావడంపై పోస్టల్ భద్రాచలం ఎస్పీ సుచేందర్ మంగళవారం విచారణ చేపట్టారు. ప్రక్రియ కొనసాగుతుండగానే మరో మూడు ఖాతాల నుంచి దాదాపు రూ.10వేల వరకు నగదు మాయం కావడం ఆయన దృష్టికి వచ్చింది. ఖాతాదారుల పాస్‌పుస్తకంలో నగదు చెల్లించినట్టు పోస్టల్ స్టాంప్ సైతం వేసిన పోస్టుమాస్టర్ వారి ఖాతాల్లో మాత్రం నగదు జమ చేయకపోవడం గమనార్హం. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి సంబంధిత పోస్టుమాస్టర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఖాతాదారులు ఎవరికైనా అనుమానం ఉంటే తమ ఖాతాలను సరిచూసుకోవాలని సూచించారు.

## చోరీకి గురైన ఐఫోన్ అందజేత



ఐఫోన్‌ను అందజేస్తున్న ఎస్‌ఐ ప్రసాద్

**మణుగూరురూరల్:** చోరీకి గురైన ఐఫోన్‌ను కనుగొని తిరిగి బాధితుడికి అందజేశారు. ఎస్‌ఐ ఎం.ప్రసాద్ కథనం మేరకు.. పట్టణంలోని ఆదర్శనగర్ ప్రాంతంలో నివాసముంటున్న నేత వైద్యులు గంజికుంట్ల సంజీవరావు ఇంటికి ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి.. చార్జింగ్ పెట్టి ఉన్న ఐఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సతీశ్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ ప్రసాద్, కానిస్టేబుల్ షమీమ్‌తో కలిసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అర్ధగంటలో ఐఫోన్ ఆచూకీని కనుగొని స్వాధీనం చేసుకోవడంతో పాటు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఐఫోన్‌ను బాధితుడు సంజీవరావుకు అందజేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఐఫోన్ ఆచూకీని కనుగొన్న పోలీసులను మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అభినందించారు.

## రూ.34.50లక్షల విలువైన గంజాయి స్వాధీనం

**అశ్వాపురం:** ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరు నుంచి తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని సోమవారం రాత్రి అశ్వాపురం పోలీసులు పట్టుకున్నారు. సీఐ అశోక్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని గొల్లగూడెంలోని సీతారామ ప్రాజెక్టు కెనాల్ వంతెన వద్ద ఎస్‌ఐ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఎంహెచ్ 10 సీఎక్స్ 8193 నంబరు కారు రాగా అందులో తనిఖీ చేయగా 138 కిలోల గంజాయి దొరికింది. దీనిని తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన రాహుల్ రాజారాం జాదవ్, విశాల్, సునీల్ హెగ్డేలను అరెస్టు చేశారు. గంజాయి, కారు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు. చింతూరుకు చెందిన సక్రు గంజాయి సరఫరా చేస్తుండగా మహారాష్ట్రకు చెందిన దాదూ షేక్ బర్ఫి పెట్టుబడి పెట్టినట్లు విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు.

## దుకాణం ఎదుట ఉమ్మిన నలుగురిపై దాడి

**ఒడిశా కూలీలకు గాయాలు**



గాయపడి మెట్ల వద్ద పడిపోయిన కూలీ

**పాల్వంచ:** పాన్ మసాలా నములుతూ దుకాణం ఎదుట కూర్చుని ఉమ్మివేస్తున్నారని సదరు దుకాణం నిర్వాహకుడు కర్రతో నలుగురిపై దాడి చేశాడు. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని కేఎస్‌పీరోడ్‌లో కూలీల అడ్డా వద్ద కొందరు ఒడిశా నుంచి కూలీలు పనికోసం వచ్చి ప్లైవుడ్ దుకాణం ఎదుట కూర్చున్నారు. వారు పాన్ మసాలా తినుకుంటూ అక్కడే ఉమ్మి వేస్తున్నారు. గమనించిన షాపు నిర్వాహకుడు కోపోద్రిక్తుడై ఓ కర్ర తీసుకుని నలుగురు కూలీలపై దాడికి పాల్పడ్డాడు. దీంతో ఒకరు అక్కడే మెట్లపై కుప్పకూలాడు. అక్కడి కూలీలంతా కలిసి దుకాణం ఎదుట గంట పాటు వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్‌ఐ రాఘవయ్య గాయపడిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దుకాణం నిర్వాహకుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులను వివరణ కోరగా లిఖిత పూర్వక ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## కేసు నమోదు

**దమ్మపేట:** అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ దుకాణంపై పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పాతచీపురుగూడెం గ్రామంలో ఓ బెల్ట్ దుకాణంలో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మంగళవారం ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డికి అందింది. సిబ్బందితో కలిసి బెల్ట్ దుకాణంపై దాడి చేసి, నిల్వ ఉంచిన 133 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, సీజ్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు. మద్యం బాటిళ్ల విలువ రూ.26,334 ఉంటుందని వెల్లడించారు.

## కాల్వలో పడి వ్యక్తి మృతి

**దుమ్ముగూడెం:** మూర్ఛ వచ్చి ప్రమాదవశాత్తు కాలువలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలో వెలుగుచూసింది. ఎస్‌ఐ కేశవరావు కథనం ప్రకారం.. మండలంలోని డి.కొత్తగూడెం గ్రామానికి చెందిన కారం తిరుపతిరావు (45) గతేడాది డాబా పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి ఆయనకు మూర్ఛ వస్తోంది. అప్పటి నుంచి ఒంటరిగా ఎటూ వెళ్లొద్దని కుటుంబ సభ్యులు చెప్పినా పట్టించుకోకవడం లేదు. సోమవారం సాయంత్రం సుబ్బారావుపేట గ్రామంలో ఉన్న తన అక్క దగ్గరకు ఇంట్లో చెప్పకుండా బయలుదేరాడు. మార్గ మధ్యలో మద్యం సేవించడంతో మూర్ఛ వచ్చి రోడ్డు పక్కనే ఉన్న తాలిపేరు కాలువలో పడిపోయాడు. మంగళవారం గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు మృతదేహాన్ని గుర్తుపట్టారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.